ప్రజాశక్తి
ఆదివారం 2 నవంబర్ 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

బల్క్ డ్రగ్ పార్కును రద్దుచేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



మత్స్యకారుల పోరాటానికి సంఘీభావం తెలుపుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి మండలం రాజయ్యపేట ప్రాంతంలో ఏర్పాటుచేస్తున్న బల్క్ డ్రగ్ పార్కును రద్దుచేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలను శనివారం సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెబితే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. స్థానికంగా ఉన్న హెటిరో కంపెనీలో స్థానికులకు ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. సంపదను అదాని, అంబానీలకు కట్టుబెట్టాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. పోలీసుల ఆంక్షలు ఇక్కడి ప్రజలు ఆధార్ కార్డులను టీ షర్టులపై ముద్రించుకుని ప్రదర్శించే స్థితికి నెట్టారంటే ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. ప్రజలపై అన్యాయంగా కేసులు పెట్టి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. హోం మంత్రి అనితను మత్స్యకారులు నమ్మి అత్యధికంగా ఓట్లు వేశారని, ప్రజలను వదిలేసి కార్పొరేట్ కంపెనీలకు ఆమె వత్తాసు పలికితే రాజకీయ భవిష్యత్తును బలి చేయాల్సి వస్తుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు వదులుకునేది లేదని, మత్స్యకారుల పోరాటానికి అండగా నిలుస్తామని, ప్రాణాలైనా ఇస్తాం కానీ బల్క్ డ్రగ్‌ను ఏర్పాటుకానివ్వమని స్పష్టం చేశారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బి.ఈశ్వరయ్య మాట్లాడుతూ, కార్పొరేట్ ప్రయోజనాలు కాపాడడం కోసం టిడిపి నాయకత్వం పనిచేస్తుందన్నారు. మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి వామపక్ష పార్టీలు అండగా ఉంటాయన్నారు. ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే ఆగేది కాదన్నారు.

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ, బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటుచేస్తే మత్స్యకారులు బతుకులు బుగ్గిపాలు అవుతాయన్నారు. తొండంగి ప్రాంతంలో అక్కడి ప్రజలు ఈ బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తే ఈ ప్రాంతంలో ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం పూనుకుందని, మత్స్యకారులందరూ ఐక్యతతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. బల్క్ డ్రగ్ ఏర్పాటుకు 1250 ఎకరాలు సేకరించాల్సి ఉండగా, 420 ఎకరాలు మాత్రమే సేకరించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారని, భూసేకరణ మొత్తం చేపట్టకుండా ప్రజాభిప్రాయ సేకరణ ఎలా చేపట్టారని ప్రశ్నించారు. బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులను మొహరించి, అనేక ఆంక్షలు పెట్టి ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత ఎన్నికల ముందు ఒకలాగా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరొకలా మాట్లాడుతున్నారని అన్నారు. మత్స్యకారుల సమస్యను మిగతా 2లో..

ఆకర్షణీయంగా పర్యాటక ప్రాంతాలు

విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : నగరంలోని పార్కులను, పర్యాటక ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఈ నెల 14, 15వ తేదీల్లో జరిగే ప్రపంచ స్థాయి భాగస్వామ్య సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు వస్తున్నారని, వారు పర్యాటక ప్రదేశాలను వీక్షించే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. గాలా డిన్నర్ ఏర్పాటుకు తగిన ప్రదేశాన్ని గుర్తించడంలో భాగంగా శనివారం ఆయన వివిధ పార్కులను సందర్శించారు. ఉడా పార్కు, ఎంజిఎం పార్కు, సీ-హారియర్స్, టీయూ-142, సబ్ మెరైన్, తెన్నేటి పార్కులను పరిశీలించారు. గాలా డిన్నర్ ఏర్పాటుకు అనుకూలంగా పరిస్థితులపై అధికారులతో చర్చించారు. పార్కింగ్ వసతి, భోజనం చేయడానికి, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనువుగా ఉండే ప్రాంతాలను పరిశీలించారు. అవసరమైన మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని, మరమ్మతులు చేయించాలని, మొక్కలను నాటాలని, ఇతర సుందరీకరణ పనులను చేయాలని అధికారులకు చెప్పారు. ఆయన వెంట విఎంఆర్‌డిఎ సిఇ వినయ్ కుమార్, ఎస్ఇ భవానీ శంకర్, సెక్రటరీ మురళీకృష్ణ, డిఎఫ్ఒ శివాణి ఇతర అధికారులు ఉన్నారు.



పర్యాటక ప్రాంతాల్లో పర్యటిస్తూ పలు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

సాయితేజ ఆత్మహత్యపై విద్యార్థుల ఆందోళన

వార్త మెయిన్‌లో..

ఉద్యోగాల పేరిట మోసం - ముగ్గురు అరెస్టు

వార్త 3లో..

అంబుజా గోబ్యాక్

జెఎసి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన

వార్త 4లో..

అందరికీ విద్య, ఉపాధి లక్ష్యం : డివైఎఫ్ఐ

వార్త 4లో..

నేడు ఆరుద్ర శత జయంతి సభ

హాజరుకానున్న తెలకపల్లి రవి



ప్రజాశక్తి : విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరానికి చెందిన ప్రముఖ అభ్యుదయ కవి ఆరుద్ర శత జయంతి సభ ఆదివారం ఉదయం 10 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. చీకటి దివాకర్ అధ్యక్షతన నిర్వహించే సభలో ప్రముఖ రచయిత, విశ్లేషకులు తెలకపల్లి రవి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, వక్తలుగా సాహితీవేత్తలు అట్టాడ అప్పలనాయుడు, కెంగార మోహన్, ఉప్పల అప్పలరాజు పాల్గొంటారని తెలిపారు. అనంతరం సాహితీ స్రవంతి నాయకులు నూనెల శ్రీనివాసరావు, ఎవి.రమణారావు సంస్మరణ సభ జరుగుతుందని, సాహితీ స్రవంతి నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'తిమిరాన్ని తరిమేస్తాం'పుస్తక ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. సభకు పి.ఫ్రాన్సిస్ అధ్యక్షత వహిస్తారని, సభలో శాసనమండలి పూర్వపు సభ్యులు ఎంవిఎస్.శర్మ, సత్యాజీ వక్తలుగా పాల్గొంటారని తెలిపారు.

పుస్తక పఠన సంస్కృతిని పెంచేందుకు మహోత్సవం

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు లక్ష్మయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె.లక్ష్మయ్య

ప్రజాశక్తి -అనకాపల్లి : పుస్తక పఠన సంస్కృతిని పునరుద్ధరించేందుకు అనకాపల్లి పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె.లక్ష్మయ్య తెలిపారు. ఎన్‌టిఆర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అనకాపల్లి ఎన్‌టిఆర్ స్టేడియంలో అక్టోబర్ 31 నుంచి నవంబర్ 7వ తేదీ వరకు నిర్వహించే ఒకటవ అనకాపల్లి పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గత 35 ఏళ్లుగా పుస్తక మహోత్సవాలను నిర్వహిస్తోందని, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, గ్రంథాలయ పరిషత్ సహకారంతో మొదటిసారిగా అనకాపల్లిలో నిర్వహిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు డిజిటల్ గాడ్జెట్లకు బదులుగా పుస్తకాలు అందించాలనే బాధ్యత తీసుకోవాలని, అప్పుడు మాత్రమే పిల్లల మానసిక అభివృద్ధి, క్రమశిక్షణ, నైపుణ్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ పుస్తక మహోత్సవం విజయవంతంగా జరగడానికి అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అండగా నిలిచారని, ఆయనకు, జివిఎంసి అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

అనకాపల్లి పుస్తక మహోత్సవ కన్వీనర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, నవంబర్ 7వ తేదీ వరకు జరిగే వివిధ కార్యక్రమాల వివరాలను వివరించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సలహాదారు రహమానుద్దీన్ పుస్తకాల ప్రాధాన్యాన్ని వివరించి, అనకాపల్లి ప్రజలు ఈ అద్భుతమైన అవకాశాన్ని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయాలి

శాసనసభలో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. మత్స్యకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ, హోంమంత్రి వంగలపూడి అనిత బల్క్ డ్రగ్ ఏర్పాటుపై తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పోలా ఈశ్వరరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు ఎంఎస్ నాగరాజు, ఎస్‌వియు సిఐ నాయకులు గోవిందరాజులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్, మహిళా సమాఖ్య నాయకులు విమల మాట్లాడారు. సిపిఎం నాయకులు ఎం.మహేష్ బాబు, సిపిఐ నాయకులు బి.బాబ్జీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి రామునాయుడు, వామపక్ష నాయకులు డి.వెంకన్న, బి.వెంకటరమణ, ఆర్.శంకరరావు, ఆర్.దొరబాబు, జి.శ్రీరామ్, ఆర్.జగ్గారావు, జి.సత్యనారాయణ, ఎం.రాజేష్, వి.అర్జునరావు, సిహెచ్.ప్రమీల, ఎం.సత్యనారాయణ, గురుబాబు, ఆర్.రాము, జి.దేముడునాయుడు, జి.సోమేశ్వరరావు, పి.తాతీలు, నానాజీ, సోమేష్, కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠన సంస్కృతిని పెంచేందుకు మహోత్సవం

వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యుడు త్రిమూర్తులురెడ్డి సైన్స్ కార్యకలాపాలైన స్టార్ గేజింగ్, మేజిక్ షోలు, నెయిల్ బెడ్, గ్లాస్ వాక్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, పాఠశాల విద్యార్థులు వీటికి హాజరు కావాలని ఆహ్వానించారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తన నియోజకవర్గంలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. మనోరమ థియేటర్ సాయిబాబా ఆలయం వద్ద శనివారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే అధికారుల సమక్షంలో పరిష్కరించారు. పరిష్కారం కాని అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల వద్దకు స్వయంగా వెళ్లి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం తనకు ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. ఎవరికి ఎటువంటి సమస్య ఉన్నా తనను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, జివిఎంసి, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్రీ కనకమహాలక్ష్మి మార్గశిర ఉత్సవాల రాట

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల రాట కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరై మార్గశిర మాసోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి కె.శోభారాణి, కార్పొరేటర్లు గోడి విజయలక్ష్మి, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

సిఐఐ సదస్సు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖ వేదికగా ఈ నెల 14, 15 తేదీలలో నిర్వహించే సిఐఐ భాగస్వామ్య సదస్సు ప్రధాన వేదికకు విచ్చేయు అతిథులకు, ప్రతినిధులకు అవసరమయ్యే మౌలిక వసతుల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. సిఐఐ భాగస్వామ్య సదస్సు కోసం ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్‌లో చేస్తున్న ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, దేశ విదేశాల నుండి సుమారు 3000 మంది ప్రతినిధులు, అతిథులు ఈ సదస్సుకు విచ్చేస్తున్నట్లు తెలిపారు. గ్రౌండ్ లెవెలింగ్, వివిఐపి పార్కింగ్ ప్రాంతం, సదస్సు జరిగే ప్రాంగణంలో అంతర్గత రోడ్లను పరిశీలించి పనులు ఎప్పటికి పూర్తవుతాయని అధికారులను, సిఐఐ ప్రతినిధులను ఆరా తీశారు. సదస్సు జరిగే ప్రాంతంలో మొక్కలతో ఆకర్షణీయంగా పనులు పూర్తి చేయాలని డిడిహెచ్ దామోదరరావును ఆదేశించారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజినీర్లు శాంతిరాజు, శ్రీనివాసరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ గంగాధరరావు ఏపీ అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహా(ర)సం...

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అధికారంలో ఉన్న పాలక పార్టీలు, నాయకులు ప్రజలకు చేదోడు వాదోడుగా ఉండి సాయం అందించాలి. కానీ దీన్ని కూడా తమ పబ్బం గడుపుకునే దృష్టితో చూడడం విశాఖ ఉమ్మడి జిల్లాలో కనిపిస్తోంది. 'మొంథా' తుపాను మిగిల్చిన విషాదం.. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, సామాన్య, పేద ప్రజలను కృంగదీస్తోంది. పట్టణాల్లో పేదల నివాసాలపై తీవ్రంగా తుపాను దాడి చేసి ఇళ్లను నాశనం చేసింది. ముఖ్యంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. రాష్ట్రంలోని 'కూటమి' పాలకులు దీన్ని కూడా ప్రచారానికి వాడుకుని రాజకీయ లబ్ధిపొందాలన్న తాపత్రయం కనిపిస్తోంది. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికే బియ్యం, ఇతర సామగ్రి ఇవ్వాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు విధానంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వరి పంట ఎకరాకు నష్టం రూ.40వేలు ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.5వేలు ఇచ్చి చేతులు దులుపుకోడానికి సిద్ధమైంది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో నిర్దిష్ట అంచనాలను వేసి సాయం అందించే చర్యలకు పూనుకోవడం లేదు.

గ్రామాలు, పట్టణాల్లోనూ సహాయక చర్యలు కొనసాగాలి...

పునరావాస కేంద్రాల్లో ఉన్నవారే అంతంత మాత్రం అన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. లెక్కల్లో మాత్రం గణనీయంగా అధికార యంత్రాంగం చూపెడుతూ వారికి సాయం గొప్పగా చేసినట్లు చెబుతున్నారు. వాస్తవానికి నివాస ప్రాంతాల్లో ప్రజలకు జరిగిన నష్టంపై 'కూటమి' పాలకులు స్థానికంగా ఫొటోలు దిగి వెళ్లిపోవడం మినహాయిస్తే నిర్దిష్టంగా సాయం చేసిన ఘటనలు ఈ తుపాను అనంతరం లేనేలేవు. ఆ మాటకు వస్తే యువజన సంఘం (డివైఎఫ్ఐ) కార్యకర్తలు, సిపిఎం కార్యకర్తల కృషితో విశాఖలోని 63వ వార్డు క్రాంతినగర్‌లో నూతన విద్యుత్ స్తంభాన్ని కొండపైకి తీసుకెళ్లి వేసిన సన్నివేశం ఈ సందర్భంగా విశాఖ ప్రజలు శభాష్ అనిపించుకునేలా చేసింది. ఏపిఇపిడిసిఎల్ అధికారుల్లోనూ ఇది చర్చనీయాంశమైంది. ఇలా పలు వార్డుల్లో తుపాను అనంతరం కొండవాలు ప్రాంతాలు, గాజువాక, ఆరిలోవ పెదగంట్యాడ వంటి పలు చోట్ల తమ కేడర్‌ను రంగంలోకి దించి సిపిఎం కృషిని కొనసాగించింది. విశాఖ నగరంలో ఇళ్లకు తీవ్రనష్టం జరిగింది. రిపేర్లకు తూతూ మంత్రంగా డబ్బులిచ్చే ప్రణాళికనే రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది. వ్యవసాయ కూలీలకు గ్రామీణ ప్రాంతాల్లో పనులు దొరక్కుండా పోయాయి. పునరావాస కేంద్రాలతో నిమిత్తం లేకుండా నష్ట లెక్కలు వేసి ఆర్థిక సాయం, నిత్యావసర సరకుల సాయం గ్రామ గ్రామాన, పట్టణాల్లోను మురికివాడలు, కొండవాలు ప్రాంతాల్లో అందించాల్సి ఉన్నా 'కూటమి' పార్టీలకు చెందిన బిజెపి, టిడిపి, జనసేన ఎక్కడా ఈ ప్రయత్నాలు దిశగా కదల్లేదు. పప్పులు, బియ్యం, పంచదార, కూరగాయలు, గుడ్లు వంటివి గ్రామీణ, పట్టణ ప్రాంత పేదలు, సామాన్య కుటుంబాలకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేస్తోంది.

వేట కోల్పోయిన మత్స్యకారులు....

తుపాను రాకతో గడచిన వారం రోజులుగా వేటను కోల్పోయి ఉపాధి దెబ్బతిన్న మత్స్యకారులను ఆదుకోవడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం సరైన విధానాన్ని ప్రకటించలేదు. మొంథా తుపానుతో పట్టణాలు, గ్రామాల్లోనూ చెరువులు, కల్వర్టులు, రోడ్లు మరమ్మతులకు గురయ్యాయి. పూడికలు పడ్డాయి. వీటిని రిపేర్లు చేసేందుకు రూ.కోట్లు కాంట్రాక్ట్ కోసం పాలక పార్టీ నేతలు చూస్తున్నారు మినహా శాస్త్రీయ పద్ధతిలో ప్రజలకు మేలు జరిగేందుకు చేయడం లేదన్నది స్పష్టమవుతోంది. స్థానిక ఎమ్మెల్యేల చుట్టూ పనుల కోసం, ఇంజినీరింగ్ సెక్షన్‌లలో చోటా నాయకుల ప్రదక్షిణలు ప్రారంభమయ్యాయి. హడావుడిగా కాకుండా పక్కా ప్రణాళికతో ఈ పనులన్నిటినీ 'కూటమి' చేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నది లేదంటే కాంట్రాక్టర్లు బడా వ్యక్తులకే ప్రయోజనం అన్నది స్పష్టం.



విశాఖకు రైల్వే జోన్ గెజిట్ విడుదల చేయాలి

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు ఈ ఏడాది జనవరి 8న దేశ ప్రధాని మోడీ శంకుస్థాపన చేసి 10 నెలలు కావస్తున్నా నేటికీ కొత్త జోన్ గెజిట్ విడుదల చేయకపోవడం సరికాదని లోక్ సత్తా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు లోక్‌సత్తా రాసిన లేఖను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ గెజిట్‌ను విడుదల చేయకుండా కేంద్రం ఎందుకు తాత్సారం చేస్తుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గెజిట్ విడుదల చేయటానికి 10 నెలలు సరిపోలేదా అని ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చానని చెబుతున్న రైల్వే జోన్ రాజ్యం లేని రాజులా ఉందని మండిపడ్డారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్, సిఎం రమేష్ త్వరగా గెజిట్ విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో లోక్‌సత్తా నేతలు ఎమ్‌ఎస్‌ఎన్.మూర్తి, ఇప్పలవలస గోపి, తుమ్మగంటి రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

శామ్‌సంగ్ వాలెట్‌లో 'డిజిటల్ కార్ కీ'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శాంసంగ్ వాలెట్ ద్వారా మహీంద్రా ఎలక్ట్రిక్ ఆరిజిన్ ఎస్‌యువిల కోసం 'డిజిటల్ కార్ కీ' సదుపాయాన్ని అందిస్తున్నట్లు మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నళినీకాంత్ గొల్లగుంట తెలిపారు. ఈ సదుపాయంతో మహీంద్రా ఎలక్ట్రిక్ ఎస్‌యువిల యజమానులు తమ గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌లను ఉపయోగించి వాహనాలను అన్‌లాక్ చేయడానికి, లాక్ చేయడానికి, స్టార్ట్ చేయవచ్చని వివరించారు. ఈ డిజిటల్ కార్ కీ నేరుగా గెలాక్సీ పరికరాలలో ఇమిడిపోయి ఉంటుందని, వినియోగదారులు తమ 'డిజిటల్ కార్ కీని స్నేహితులు, కుటుంబ సభ్యులతో పరిమిత కాలానికి పంచుకోవచ్చని తెలిపారు.

హెచ్ఎస్ఎల్‌లో 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్'



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) అక్టోబర్ 27 నుండి విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2025ను నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా పరవాడ వద్ద అవగాహన గ్రామ సభ నిర్వహించారు. ఉద్యోగుల కోసం క్విజ్, వ్యాస రచన, నినాద పోటీలు, విక్రేతలు, కాంట్రాక్టర్ల కోసం ఇంటరాక్టివ్ సెషన్‌లను నిర్వహించారు. సమగ్రత, నిఘాపై అవగాహన పెంచేందుకు హెచ్ఎస్ఎల్ స్కూల్ సమీప కళాశాలల్లో ఔట్రీచ్ కార్యక్రమాలు చేపట్టారు. శనివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ (షిప్‌బిల్డింగ్) కెప్టెన్ జి.వెంకటేశ్వర్లు, ముఖ్య అతిథిగా పాల్గొని "నిఘా మనందరి ఉమ్మడి బాధ్యత" అనే అంశంపై ప్రసంగించారు. నిజాయతీ, సమగ్రత, నిబద్ధత, సంస్థ నిర్దేశించిన నిబంధనలు, విధానాలను తప్పనిసరిగా పాటించాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు పంపిణీ చేశారు.

ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా శ్రీ జి.సన్యాసినాయుడు సర్వే నెంబరు 30లో విస్తీర్ణం 2.00 హెక్టార్లలో, మాకవరపాలెం గ్రామం, మాకవరపాలెం మండలము, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్, పర్యావరణ అనుమతులు యొక్క ఆర్డర్ నెం. SEIAA/AP/MIN/EC/AK/09/2025/1819/273.17 & 273.15 తేది: 28-10-2025, రోడ్ మెటల్ బిల్డింగ్ స్టోన్ త్రవ్వకం కోసం SEIAA, ఆంధ్రప్రదేశ్ నుండి పర్యావరణ అనుమతులు పొందియున్నారు. ఆ ప్రతులు పరివేష్ పోర్టల్, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పులు మంత్రిత్వశాఖ (MoEF & CC), వెబ్‌సైట్ నందు లభించును.

ఇట్లు
శ్రీ జి.సన్యాసినాయుడు

NOTICE
AS PER THE ORDERS OF THE HONBLE COURT
IN THE HONOURABLE COURT OF PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) YELLAMANCHILI
I.A. 308/2024 O.S. 215/2007
Between:
Jagarapu Satyavathi
Petitioner/plaintiff
AND
Jagarapu Musili Paradesi Naidu and others
...Respondents/Defendants
To:
R-5: Gandi Paiditalli @ Punyavathi, W/o Mutyala Naidu, Adireddipalem village, Sabbavaram Mandal, Visakhapatnam District
That the petitioner filed a petition before the Honble court against the respondents in the above matter, you avoiding service of notices through court or R.P. somehow or other hence this notice. Therefore take notice that you should appear in person or through Advocate **on 04-11-2025 at 10.30 A.M** before the Hon'ble Principal Civil Judge (JUNIOR DIVISION), Yellamanchili failing which an order will passed against you, setting you ex-parte.
S.APPALA NAIDU
Advocate for Petitioner/Plaintiff
Yellamanchili
Dt. 24-10-2025

మహారాజశ్రీ అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A. 761/2024 IN A.S.No. /2024
Between:
Lalam Sanyasirao
...Petitioner/Appellant
And:
Masavarapu Mutyalayya (Died) etc.
...Respondents/Respondents
To
7TH RESPONDENT :
Smt. Animireddi Mutyalamma, W/o Atchemnaidu, R.Bheemavaram village and post, Anakapalli District.
నోటీసు
పై నెంబరు I.A.ను అప్పిలెంటు O.S.No. 154/2016 దావాలో అనకాపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారు తే.07-03-2024దిన జారీ చేసిన డిక్రీ మరియు జడ్జిమెంటును రద్దుపరచిందమని అప్పీలు దాఖలు చేయుటలో జరిగిన 43 రోజుల ఆలస్యంను క్షమించవలని రెస్పాండెంట్లు పై నెంబరు I.A. 761/2024 దాఖలు చేసియుంటిరి. కాగా పై నెంబరు అప్పీల్లో 7వ రెస్పాండెంటు అయిన మీకు అప్పీలు నోటీసు నిమిత్తం **తే.14-11-2025దికి వాయిదా** అయివున్నది. కావున మీరు సదరు తేదిన మీరు గాని మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో **ఉదయం గం 10-30 నిలకు** హాజరై ఏమైనా అక్షేపణలు ఉన్నచో తెలియపరుచుకోవలెను లేనిచో మీ పరోక్షముందు తీర్మానించడం మగునని ఇందు మూలంగ తెలియపరచడమైనది.

లంక జగన్నాథం,
లంక పార్వతీశ్వర్
అడ్వకేట్లు,
అనకాపల్లి
అనకాపల్లి
తే.01-11-2025 దీ

మృతురాలి కుటుంబానికి ప్రభుత్వ సాయం


రూ.4లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామపంచాయతీ తునిపాలెం గ్రామంలో గెడ్డలో కొట్టుకుపోయి మృతిచెందిన కళ్ళ ధనశ్రీ కుటుంబానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రభుత్వం తరపున రూ.నాలుగు లక్షల ఆర్థికసాయం చెక్కును అందజేశారు. శనివారం గ్రామం వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. రేకులషెడ్‌లో దీనంగా జీవనం సాగిస్తున్న ఆ కుటుంబం వచ్చిన ఆర్థికసాయంతో పక్కా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కె.రమణ, ఎంపిడిఒ కె.రూపేష్, తహశీల్దార్ ఆనందరావు, మాజీ టిడిపి అధ్యక్షులు కె.నగేష్ కుమార్, తెలుగు యువత మండల అధ్యక్షులు కెవి.సత్యనారాయణ పాల్గొన్నారు.

'సమత' విద్యార్థి ఆత్మహత్య దారుణం

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలో ఎంవిపి కాలనీలోని సమత డిగ్రీ, పీజీ కళాశాల బిఎస్‌సి ఫైనలియర్ విద్యార్థి కోన సాయితేజ ఆత్మహత్య ఘటన రాష్ట్ర ప్రజలను తీవ్రంగా కలచివేసిందని వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు కె కె రాజు అన్నారు. విద్యార్థులపై వేధింపులు, మానసిక ఒత్తిడి, అకడమిక్ హింసలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ఇవన్నీ కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి తార్కాణమన్నారు విద్యాసంస్థల్లో విద్యార్థుల రక్షణ, మానసిక సాంత్వన, బాధ్యతాయుత పర్యవేక్షణ వంటి అంశాలపై ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సాయితేజ మరణంపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులైన అధ్యాపకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భద్రతకు అన్ని కళాశాలల్లో ఫిర్యాదుల విభాగం, కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు .

తుపాన్ బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి- తగరపువలస: మొంథా తుపాను ప్రభావిత చిన్న నాగయ్యపాలెం మూలకొద్దు గ్రామాల్లో శనివారం ఎపి కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు పంచకర్ల సందీప్ పర్యటించారు. దెబ్బతిన్న ఇళ్లు, విద్యుత్ సరఫరా అంతరాయం, తాగునీరు సమస్యలను పరిశీలించారు. ఆయా సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆర్‌డిఒ సంగీత్‌మాధుర్‌ను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తుపానుతో నష్టపోయిన ప్రతి కుటుంబాన్నీ కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని పంచకర్ల సందీప్ హామీ ఇచ్చారు. బాధితులు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామస్వామి నాయుడు, శ్రీనుబాబు, అధ్యక్షులు నక్క శ్రీధర్, రెండవ వార్డు అధ్యక్షులు ఎన్.శంకర్ రెడ్డి, కొయ్య శ్రీనివాస్, పాపారావు పాల్గొన్నారు

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బాటజంగాలపాలెం పంచాయతీ శివారు బంజరిక చెందిన ఒక వ్యక్తి ఆవులను మేతకు తీసుకెళ్లి చెరువులో కాలు జారిపడి మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం... బాట జంగాల పాలెం పంచాయతీ బంజరి గ్రామానికి చెందిన ఇందుకూరి వెంకటరమణ రాజు ఆవులను శుక్రవారం మేతకు తోలుకెళ్లారు. సాయంత్రం ఆవులను తిరిగి ఇంటికి తీసుకొచ్చే క్రమంలో చిక్కాల వాని చెరువులో వెంకట రమణ రాజు కాలు జారుపడి పడిపోయి మృతి చెందాడు. వెంకటరమణరాజు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక సిఐ జి రామచంద్రరావు తెలిపారు. తెలిపారు. మృతునికి కుమారుడు నవీన్ రాజు ఉన్నారు.

భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర

ప్రజాశక్తి- సీతమ్మధార.: భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర సాగుతోందని ఆల్ ఇండియా దళిత రైట్స్ మూవ్‌మెంట్ (ఎఐడిఆర్‌ఎం)జాతీయ ప్రధాన కార్యదర్శి వివిఎస్. నిర్మల్ మండిపడ్డారు. శనివారం పౌర గ్రంథాలయంలో 'రాజ్యాంగం- దళిత హక్కులు - బిజెపి విధానాలు' అంశంపై దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్)ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ పాలనలో దేశంలో కుల,మత విద్వేషాలు పెరిగాయన్నారు. దళితులు పోరాడి సాధించుకున్న అట్రాసిటీ చట్టం పూర్తి స్థాయిలో అమలు జరగడం లేదన్నారు. దేశంలో వేలాది కేసులు నమోదౌతున్నా, శిక్షలు ఐదుశాతానికి మించడం లేదన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ జైళ్లలో బెయిలు లేకుండా మగ్గిపోతున్న వారిలో అధిక శాతం ఎస్‌సి, ఎస్‌టిలేనన్నారు. సబ్‌ప్లాన్ చట్టం ఉన్నా ఎస్‌సి, ఎస్‌టిలకు తగినన్ని నిధులు కేటాయింపు లేదన్నారు . డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జెవి. ప్రభాకర్ మాట్లాడుతూ లౌకిక, సామ్యవాద ప్రజాస్వామ్యమనే పదాలను తొలగించడానికి



సదస్సులో మాట్లాడుతున్న నిర్మల్

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలు, సంస్థలు, భూములు లాంటి ప్రజల ఆస్తులనుకార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు రాజులు, రిమ్స్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ .తెన్నేటి జయరాజు, ప్రొఫెసర్ అర్జున , కెవిపిఎస్ చిరంజీవి మాట్లాడారు. ఎల్.కృష్ణ ఆధ్వర్యంలో జన చైతన్య మండలి బృందం చైతన్య గీతాలు ఆలపించారు

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -మధురవాడ : ప్రభుత్వ వైద్యకాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి ఆరోవార్డు పీఎం పాలెం ఆఖరి బస్ స్టాప్ సమీపంలో శనివారం వైసిపి వార్డు అధ్యక్షుడు, అనూష క్యాటరింగ్ అధినేత పోతిన ప్రసాద్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, వైద్యకాలేజీలను ప్రైవేటుకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ సంతకాలు చేశారని పోతిన ప్రసాద్ తెలిపారు. కార్యక్రమం లో పార్టీ నాయకులు పోతిన ఎల్లాజీ, పిళ్లా రమణ బాబు, గాదె రోశిరెడ్డి, పోతిన సూరిబాబు, వార్డు మహిళా అధ్యక్షు రాలు కొండపల్లి వరలక్ష్మి,వాంద్రాసి సూరి అప్పారావు, సత్తి బాబు, నరసింహ రావు, ఎం అప్పారావు పాల్గొన్నారు.

సీతమ్మధార : ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తర నియోజకవర్గం 51వ వార్డు మాధవదార, వుడా కాలనీ, ఈస్ట్ పార్కు గేట్ వద్ద కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో వైసిపి


కోటి సంతకాల సేకరణలో వైసిపి జిల్లా అధ్యక్షుడు రాజు

సంతకాల సేకరణ చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షులు కె.కె రాజు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, తిరుమలరావు, సబ్బవరపు శ్రీను, దమయంతి, పొన్నాడ అప్పారావు మాస్టర్, రత్నం, ధర్మవతి, లత, మైలపల్లి శ్రీను, వరహాలరాజు, రాణి, వెంకటరమణ, పైడి రాజు, రామారావు, ఎర్నిబాబు, చిన్ని,గణేష్ పాల్గొన్నారు.

ముంపు పైర్ల సస్యరక్షణకు సూచనలు

ప్రజాశక్తి- ఆనందపురం : మొంథా తుపాన్ వర్షాలతో ముంపునకు గురైన వరిపైర్లు సస్యరక్షణకు మండల వ్యవసాయ అధికారి సంధ్య రత్నప్రభ రైతులకు సూచనలు చేశారు. పిలక దశలో వరి పంట ముంపునకు గురైతే, ముందుగా నీటిని పూర్తిగా తొలగించాలని, తర్వాత 20కిలోల యూరియా, 20కిలోల పొటాష్ పైర్లకు అందిస్తే త్వరగా కోలుకుంటుందన్నారు. పిగులు పొట్ట , పూత దశలో పైర్లు, ఒకటి రెండు రోజులకు మించి నీటమునిగితే కంకులు బయటకు రాకపోవడం, పుష్పాలలో నీరు చేరడం వలన ఫలదీకరణ శక్తి తగ్గి తాలు గింజలు ఏర్పడతాయన్నారు. ఈ పరిస్థితుల్లో గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి 2 గ్రాములు కార్బండెజిమ్, లేదా మాంకోజెబ్ లేదా ఒక మిల్లీటీటర్ ప్రొపికొనజోల్ మందును పిచికారి చేయాలని సూచించారు.

పాలు పోసుకునే దశలో 2,3 రోజులకంటే ఎక్కువగా పంట నీటమునిగితే గింజల్లో పిండిపదార్థాల చేరిక తగ్గి బరువు, నాణ్యత దెబ్బతింటాయని హెచ్చరించారు. ఈ దశలో రసాయన మిశ్రమం పిచికారితో గింజల రంగు మారకుండా ఉంచవచ్చన్నారు.

రామన్నపేట అభివృద్ధికి చొరవ

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు రామన్నపేటలో దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని సిసి రోడ్లు, కాలువల సమస్యలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో మోక్షం లభించిందని వార్డు టిడిపి అధ్యక్షుడు తమ్మిన సూరిబాబు అన్నారు. సమస్యలను ఎమ్మెల్యే గంటా దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడిమంజూరు చేయించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అభివృద్ధి పనులను ఇపుడు కూటమి ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీ మేరకు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

సోలార్ దీపాలు ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి -పద్మనాభం: పద్మనాభంలోని అనంతపద్మనాభస్వామి గిరిపైనున్న ఆలయానికి వెళ్లే మార్గంలో సోలార్ దీపాల ఏర్పాటుకు దాతలుముందుకు రావాలని భక్తులు కోరుతున్నారు. సాయంత్రమైతే, ఈ మార్గంలో చిమ్మచీకట్లు అలుముకుంటున్న నేపథ్యంలో ఇబ్బందికర పరిస్థితులున్నాయని, ప్రభుత్వపరంగా ఏర్పాటుకు చర్యల్లేని నేపథ్యంలో దాతలైనా ముందుకు వచ్చి పద్మనాభుని గిరిపైకి వెళ్లే మార్గంలో వెలుగులు నింపాలని కోరుతున్నారు.

కూలిన చెట్టు తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి- వేపగుంట : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో భారీ వృక్షం ప్రమాదకరంగా ఉంది. ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షాలకు పాఠశాల ప్రాంగణంలోని చెట్టు వంటశాల గదిపై వాలిపోయింది శనివారం 94వ వార్డు వార్డ్ కార్పొరేటర్ బల్ల శ్రీనివాస్ పరిశీలించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాలిపోయిన చెట్టు తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. వార్డు పరిధిలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, నేతలతోపాటు అధికారుల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.


వాలిన చెట్టును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

నేరాలు ఘోరాలు

ఉద్యోగాల పేరిట మోసం

- ముగ్గురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక : కోర్టులో అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన కేసులో ముగ్గురిని గాజువాక పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. సిఐ ఎ.పార్థసారథి తెలిపిన వివరాలివి.

జోగవానిపాలెనికి చెందిన పోకల సత్యవతి తాను లాయరునని చెప్పి, కోర్టులో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి గొల్లవిల్లి శ్రీను, గండికోట కొండబాబు అనే ఇద్దరు వ్యక్తుల వద్ద డబ్బులు వసూలు చేసింది. అటు ఉద్యోగాలు ఇవ్వక, ఇటు తామిచ్చిన డబ్బులు వాపసు చేయకపోవడంతో తాము మోసపోయామని భావించిన బాధితులిద్దరూ గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, పోకల సత్యవతితోపాటు ఆమెకు సహకరించిన గుడివాడ అప్పన్న కాలనీకి చెందిన ఆటో డ్రైవర్లు గొల్లపల్లి అప్పల రమణ, ఆరేపల్లి సదాశివరావులను అరెస్ట్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇద్దరితోపాటు మరో నలుగురైదుగురు నుంచి రూ.నాలుగు లక్షల వరకు నిందితులు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టుకు గాయాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:బుచ్చయ్యపేట మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న నరేంద్ర విధులు ముగించుకొని శనివారం సాయంత్రం చోడవరం వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనం పరస్పరం ఢీ కొనడంతో నరేంద్రకు తీవ్రంగా గాయాలయ్యాయి. కాలు తలపై తీవ్రంగా గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే పడిపోయారు. స్థానిక ఎంపీడీవో శివప్రసాద్ నారాయణ సమాచారం తెలుసుకొని గాయపడిన నరేంద్రకు ప్రథమ చికిత్స చేయించారు. ఘటనా స్థలంలో ఉన్న వాహనదారులు 108 కు 6 గంటల సమయంలో సమాచారం ఇచ్చినా అంబులెన్స్ జాడలేదు. ఏడు గంటల దాటిన కూడా అంబులెన్స్ రాకపోవడంతో చోడవరం నుండి ఒక ప్రైవేటు అంబులెన్స్ ను స్థానికులు రప్పించి గాయపడిన నరేంద్రను అనకాపల్లికి తరలించారు.

అక్రమంగా గోవుల తరలింపు

- ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ఆనందపురం : మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో గోవులను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. దుక్కవానిపాలెం, తర్లువాడ టోల్‌గేట్ సమీపంలో పోలీసులు జరిపిన వాహన తనిఖీల్లో బొలెరో వ్యాన్‌లో తరలిస్తున్న 9 గోవులను పట్టుకున్నారు. నీరు, ఆహారం లేకుండా ఒకటిపై మరొకదాన్ని కట్టి దయనీయస్థితిలో తరలించడాన్ని గుర్తించారు. విజయనగరం జిల్లా గుర్ల మండలం గొజ్జంగవలస గ్రామానికి చెందిన బి. ఆనంద్, పతివాడ శ్రీను రాజాం సంతలో గోవులను కొనుగోలు చేసి ఎటువంటి అనుమతులు, వేబిల్లులు లేకుండా తాడేపల్లిగూడెం సంతకు తరలిస్తున్నట్లు విచారణలో గుర్తించారు. సిఐ చింతా వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ సంతోష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం బీచ్ వద్ద శనివారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. స్నానానికి సముద్రంలో దిగిన పదో తరగతి విద్యార్థి నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...

జిల్లాలోని మాకవరపాలెం మండలం భీమబోయనపాలెం గ్రామానికి చెందిన ఎస్.భాను (15) పరవాడ మండలంలోని తానాం బీసీ హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం సుమారు 10.45 గంటల సమయంలో తానాం హాస్టల్‌కు చెందిన మరో నలుగురు విద్యార్థులు ఆర్.దుర్గాప్రసాద్ (తానాం), ఎం.సిద్ధి (మదుతూరు), ఎస్.రామ్ చరణ్ తేజ (వల్లూరు), ఎం.చందు (కొత్తూరు)తో కలిసి ముత్యాలంపాలెం బీచ్‌కు వెళ్లి స్నానానికి దిగారు. స్నానం చేస్తుండగా అలల ఉధృతికి వీరంతా కొట్టుకుపోయారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న మత్స్యకారులు, హోం గార్డ్ చింతల అప్పారావు సహాయంతో నలుగురు విద్యార్థులను రక్షించారు. ఎస్.భాను మాత్రం సముద్ర అలల్లో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పరవాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన విద్యార్థి కోసం గాలింపు చేపట్టారు.

నిజాయితీని చాటుకున్న దంపతులు



బాధితునికి వాలెట్ అందజేస్తున్న షబీనా

ప్రజాశక్తి-గాజువాక : షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి ఎండీ వ్యక్తిగత సెక్రటరీ అనపర్తి షబీనా అజ్మా నిజాయితీని చాటుకుంది. వివరాల్లోకి వెళితే, కంచరపాలెం చెందిన అనపర్తి షబీనా అజ్మా కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో పనిచేస్తోంది. శనివారం విధులు ముగించుకొని తన భర్తతో బైక్‌పై వెళుతుండగా గాజువాక డిపో సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద మనీ వాలెట్ దొరికింది., అందులో రూ. 25వేలు నగదు ఉన్నట్లు గుర్తించారు. నిజాయితీగా వ్యవహరించిన ఆ దంపతులు, దొరికిన వాలెట్‌ను గాజువాక పోలీస్‌లకు అప్పగించారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు, గాజువాక ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీకి చెందిన దండువోలు సతీష్ కుమార్‌దిగా గుర్తించారు. సతీష్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్‌కు రప్పించి, షబీనా చేతుల మీదుగా వాలెట్‌ను అప్పగించారు. షబీనా దంపతులు నిజాయితీని పోలీసులు అభినందించారు.

9న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్యామలదీపిక, రాము

ప్రజాశక్తి- సీతమ్మధార : నవోదయ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఈ నెల 9న రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని టోర్నమెంట్ డైరెక్టర్, ఫిడే ఇన్‌స్ట్రక్టర్ ఎం.రామకృష్ణ తెలిపారు. దీనికి సంబంధించి బ్రోచర్‌ను శనివారం కాలేజీ కరస్పాండెంట్ పెనుమత్స శ్యామలాదీపిక, భీశెట్టి రాము, నిర్వాహకులు నరేష్, ఎంఎస్‌పి.కుమార్, కిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆల్ విశాఖ చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రంగాల బాబూరావు, మణికంఠరావు మాట్లాడుతూ ఈ పోటీలను ఆదిత్య చెస్ అకాడమీ నిర్వహిస్తోందని, ప్రతిభ చూపిన 15 మంది క్రీడాకారులను త్వరలో విజయవాడలో జరిగే అంతర్జాతీయ రేటింగ్ చెస్ పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. పోటీలలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్నవారు ఈనెల 8లోగా తమ పేర్లను apchess.org వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9010323324 ఫోను నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న చీఫ్ ఇంజనీర్ మణి భాస్కర్

ప్రజాశక్తి- గాజువాక : చెట్లు పెంపకంతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని ఎపిఐఐసి చీఫ్ ఇంజనీర్ మణి భాస్కర్ అన్నారు. శనివారం గాజువాక ఆటోనగర్‌లో మొక్కలు నాటారు. చెట్లను నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ భాగస్వామ్య సదస్సులో భాగంగా గాజువాక ఆటోనగర్‌లో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఐలా కమిషనర్ కిషోర్, ఇన్‌ఛార్జి చైర్మన్ కె.ఈశ్వరరావు, సెక్రెటరీ సిహెచ్ సత్యనారాయణ, ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు.

అందరికీ విద్య, ఉపాధి లక్ష్యం

• డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా అధ్యక్షుడు రాజు



యూనియన్ పతాకావిష్కరణలో డివైఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార : అందరికీ విద్య, ఉపాధి లక్ష్యంగా ఆవిర్భావం నుంచి దేశవ్యాప్తంగా డివైఎఫ్ఐ పోరాటం చేస్తోందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. శనివారం తాటిచెట్లపాలెం ఎస్ఆర్ నగర్‌లో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డివైఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ 1980 నవంబర్ 1, 2, 3 తేదీలలో పంజాబ్ రాష్ట్రం లూథియానాలో ఆవిర్భవించిన డివైఎఫ్ఐ నాటి నుంచి నిరుద్యోగుల పక్షాన పోరాడుతోందన్నారు. అధికారంలోకి వస్తే ఏటా రెండుకోట్ల ఉద్యోగాలిస్తానని నమ్మబలికిన ప్రధాని మోడీ, ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోగా, ఉన్న చిన్నతరహాపరిశ్రమలను మూసేస్తూ, ప్రభుత్వరంగ సంస్థలకు అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కట్టబెడుతూ దేశసంపదను దోచిపెడుతున్నారని మండిపడ్డారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో ఉద్యమాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటువరం చేయకుండా అడ్డుకుంటామన్నారు. ప్రతి నిరుద్యోగికి రూ.మూడు వేలు నిరుద్యోగభృతి ఇస్తామని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ఏడాదైనా అమలు చేయలేదన్నారు. వీటికోసం డివైఎఫ్ఐ చేపట్టే పోరాటాల్లో నిరుద్యోగ యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కోటి , కోటయ్య, ఆది, ప్రకాష్ పాల్గొన్నారు

షీలానగర్‌లో కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు

• 37వ శాఖను ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా, డిసిసిబి చైర్మన్ తాతారావు

ప్రజాశక్తి -గాజువాక : ది కనకమాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు 37వ శాఖను శనివారం షీలానగర్‌లో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి డిసిసిబి చైర్మన్ కోన తాతారావు సంయుక్తంగా ప్రారంభించారు. బ్యాంక్ స్ట్రాంగ్ రూం, క్యాష్ కౌంటర్‌ను నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ అండ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్, విసిబి వైస్ చైర్మన్ చలసాని రామచంద్రరావు, కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ జామశెట్టి వెంకట సత్యనారాయణ మూర్తి, ది మహారాజ కోఆపరేటివ్ బ్యాంక్ ఫౌండర్ చైర్మన్ ఎం రామకృష్ణ రాజులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిన్న, మధ్యతరహా, ఉన్నత స్థాయి ఇలా అన్నివర్గాల ప్రజలకు సహకారం అందించేందుకు కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు పనిచేయాలని సూచించారు. జిల్లా సహకార అధికారి టి.ప్రవీణ మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో సహకార బ్యాంకుల పాత్ర ప్రధానమైందన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రజలకు అందుబాటులో మెరుగైన సేవలనుకనకమాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు అందిస్తుందన్నారు. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో 11 జిల్లాల్లో 37 శాఖలుగా విస్తరించిన కనకమహాలక్ష్మి కోపరేటివ్ బ్యాంకు రూ.1077కోట్ల డిపాజిట్లతో, రూ.692 కోట్ల రుణాలు మంజూరు చేస్తూ, రూ.1769 కోట్లు వ్యాపార లావాదేవీలను నిర్వహిస్తోందన్నారు. కార్పొరేట్ బ్యాంకులు దీటుగా ఖాతాదారులకు ఎటిఎం, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ వంటి సదుపాయాలను అందిస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లకు డిపాజిట్లపై అధిక వడ్డీ, వ్యాపారులకు తొందరగా రుణాల మంజూరు వంటి సేవలు అందిస్తున్నామన్నారు. మరో వారంలో విశాఖలో టౌన్ కొత్త రోడ్ శాఖను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్, జి రామకృష్ణ, ఇతర డైరెక్టర్లు, సిఇఒ కె.శ్యామ్ కిషోర్, షీలా నగర్ మేనేజర్ కె.సింహాచలం పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎన్‌సిసి అధికారికి సత్కారం



రిటైర్డ్ ఎన్‌సిసి ఆఫీసర్‌కు సత్కారం

ప్రజాశక్తి- సీతమ్మధార : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో 22ఏళ్లుగా ఎన్‌సిసి ఆఫీసర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన మేజర్ టి. బ్రహ్మానంద రెడ్డిని శనివారం కాలేజీలో కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2003లో 2(ఎ)బెటాలియన్ ఎన్‌సిసి ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించి, ఎంతోమంది క్యాడెట్లను సిద్ధంచేసి, ఆర్‌డి పరేడ్‌కు ప్రాతినిధ్యం వహించేలా చేశారని కొనియాడారు. బుల్లయ్యకాలేజీలో ఆరు ఎన్‌సిసి, ఐదు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఏర్పాటులో మేజర్ టి.బ్రహ్మానంద రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. రక్తదాన శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో క్యాడెట్లు ఉత్సాహంగా భాగస్వాములయ్యేలా విద్యార్థులను ప్రోత్సాహించారన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివిఎస్‌కె చక్రవర్తి ,ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. దీపక్ చౌదరి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సోమేశ్వర్ రెడ్డి, ఎన్‌సిసి ఆఫీసర్స్ ఫ్లైట్ లెఫ్టినెంట్ డాక్టర్ బిఆర్ఎస్ లక్ష్మణ్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ కె.ఉమా నాగేశ్వరి , సబ్ లెఫ్టినెంట్ లక్ష్మణబాబు, రమా గోస్వామి పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామి నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నం మురళీనగర్‌కు చెందిన బొడ్డు భగవాన్ పాత్రుడు దంపతులు రూ.100,106 విరాళం అందజేశారు. విరాళం చెక్కును ప్రోటోకాల్ పర్యవేక్షణ అధికారి సునీల్‌కుమార్‌కు అందజేసి నిత్యాన్నదాన పథకంలో శాశ్వతసభ్యులుగా చేరారు. దాతలకు రశీదు, బాండ్ అందజేసి, స్వామి అంతరాలయ దర్శనం కల్పించి, అనంతరం శేష వస్త్రం, ప్రసాదాలను ఆలయ పర్యవేక్షణ అధికారి కె. వెంకటేశ్వరరావు అందజేశారు.

'అంబుజా గోబ్యాక్'

• జెఎసి ఆధ్వర్యంలో కొవ్వొత్తున నిరసన



నిరసన ప్రదర్శనలో జెఎసి నేతలు

ప్రజాశక్తి -గాజువాక : అదానీ అంబుజా సిమెంట్ గ్రౌండింగ్ యూనిట్ గోబ్యాక్ అంటూ జెఎసి ఆధ్వర్యంలో పెద గంట్యాడ, సీతానగరం గ్రామంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కొవ్వొత్తులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ మేరకు సీతానగరంలో ఇంటింటా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ అంబుజా సిమెంట్ గ్రౌండింగ్ ప్రక్రియను తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేసారు. కార్మిక సంఘాల నేతలు నమ్మి రమణ, డి.ఆదినారాయణ, పులి రమణా రెడ్డి, ఏలేటి శ్రీనివాస్, కె సత్యనారాయణ, జి ఆనంద్, అచ్చిబాబు, మంత్రి శంకర నారాయణ, మసేను రావు, దొమ్మేటి అప్పారావు, జ్యోతి రెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దివీస్ చేయూత



విద్యావాలంటీర్ల వేతన చెక్కు అందజేస్తున్న దివీస్ ప్రతినిధులు

ప్రజాశక్తి-తగరపువలస : భీమిలి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యాభివృద్ధి, మెరుగైన విద్యప్రమాణాలకు దివీస్ లేబరేటరీ సహకారాన్ని అందిస్తోందని సంస్థ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్ రావు తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో జీతభత్యాలను సంస్థ తరపున చెల్లిస్తూ విద్యావాలంటీర్లను నియమించిందన్నారు. శనివారం విద్యావాలంటీర్ల జీతాల చెల్లింపునకు రూ.11లక్షల చెక్కును జనరల్ మేనేజర్ ఎం ఎస్ ఎన్ రావు, డిఇఎం పి. జగదీష్ సిబ్బందికి అందించారు. దివీస్ సిఎస్ఆర్ నిధులతో ప్రతినెలా రూ.లక్ష చొప్పున విద్యావాలంటీర్ల వేతనాలకు దివీస్ సంస్థ వెచ్చిస్తోందన్నారు. కార్యక్రమంలో దివీస్ సిఎస్ఆర్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత

ప్రజాశక్తి-సీతమ్మధార : మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు, వాతావరణ మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ .పి.జగదీశ్వరరావు సూచించారు. శనివారం ఆనందపురం పిహెచ్‌సిని సందర్శించారు. అభ ఐడి రిజిస్ట్రేషన్, ఎఎన్ఎం సేవలపై సమీక్షించారు. గర్భిణులకు సేవలు, ఎన్‌సిడి 4.0 స్క్రీనింగ్, ఇహెచ్ఆర్, ఐహెచ్‌ఐపి, ఆర్‌సిహెచ్ నమోదుపై సిబ్బందికి సూచనలు చేసారు. సిబ్బంది అందరు ఎఫ్ఆర్ఎస్ హాజరు విధిగా వేయాలని, సమయపాలన పాటించాలన్నారు. ఎన్‌హెచ్ఎం డిపిఒ డాక్టర్ .బి.ఉమావతి, ఎంపిహెచ్ఇఒలు రవిశంకర్, నారాయణరావు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

కాశీబుగ్గ ఘటనపై దిగ్భ్రాంతి

ప్రజాశక్తి- సీతమ్మధార : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటనలో పది మంది భక్తులు దుర్మరణంపై వైసిపి జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇలాంటి సంఘటనలు ఎక్కువయ్యాయని, ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమన్నారు బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గాజువాక : కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన భక్తుల కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు టి శ్రీరామమూర్తి సంతాపం తెలిపారు. ఘటనపై విచారణ జరిపించాలని కోరారు.

విపత్తుల నిర్వహణకు సమగ్ర ప్రణాళిక

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : ముంథా తుఫాను ఎదుర్కొన్న అనుభవాలతో భవిష్యత్తులో విపత్తుల నిర్వహణకు మరింత సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులకు సూచించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించి తుఫాను సమయంలో తీసుకున్న ముందుజాగ్రత్త చర్యల వలన ఫలితాలు, ఎదుర్కొన్న ఇబ్బందులు, అధికారులు అనుభవాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాయంత్రాగం తీసుకున్న ముందుజాగ్రత్త చర్యలు, జిల్లా, మండల అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయం, సమిష్టి కృషి మూలంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం జరుగకుండా నివారించగలిగినట్లు చెప్పారు. విద్యుత్ శాఖకు సంబంధించి ముందుగానే సిద్ధం చేసుకున్న విద్యుత్ స్తంబాలు, పరికరాలతో విద్యుత్ అంతరాయం రాకుండా పనిచేశారన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గర్భిణులను ఆసుపత్రులకు తరలించి సుఖప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు నిరంతరం రిజర్వాయర్లు, కాలువలు తనిఖీచేసి అవసరమైన చోట్ల ముందస్తు చర్యలు తీసుకున్నారని తెలిపారు. రెవిన్యూ, పోలీసు, రోడ్లు భవనాలు, ఐసిడిఎస్, మునిసిపాలిటీ, రవాణా, గ్రామపంచాయతీ తదితర శాఖలన్ని కూడా వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించడంతో తుఫానును సమర్ధవంతంగా ఎదుర్కోనడం జరిగిందని కలెక్టరు తెలిపారు. పారిశుధ్యానికి సంబంధించి ప్లాస్టిక్ అతిపెద్ద సమస్య అని, అనేక కాలువలు ప్లాస్టిక్ కవర్లు, సీసాలు మూలంగా మూసుకుపోతున్నాయని, కాలువలలో చెత్తను వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగతంగా ప్లాస్టిక్ సంచులు వినియోగం మానుకోవాలని, అందుకు ముందుగా అధికారులు గుడ్డ, జ్యూట్ సంచులు వినియోగించి, ప్లాస్టిక్ సీసాలు వినియోగించకుండా ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లకు విలువ కల్పించాలని, వాటి పునర్ వినియోగం నకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి టెన్ని కాయిట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం : బాపట్ల జిల్లా చీరాలలో నవంబర్ 7 నుండి జరుగునున్న 402వ ఎపి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు జిల్లాస్థాయి జట్లును ఎంపిక చేసినట్లు స్థానిక అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్ సిహెచ్ కేశవరావు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, సిఎల్ఎం ప్రసాద్, సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి జి.కనకారావు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలకు పి.సాగర్, పుప్పాటి అబినాష్, పి.ప్రవీణ్‌కుమార్ (సబ్బవరం గురుకులం), జి.ఆశ్లేష్ కుమార్ (ఏఎంఏఎల్ కళాశాల, అనకాపల్లి), కె ఇనోష్ (దేవరాపల్లి గురుకులం)లను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన వారు జాతీయస్థాయిలో ఈనెల 26 నుండి 30 వరకు జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెఎన్‌వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ వారోత్సవాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విజిలెన్స్ వారోత్సవాలపై అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శంకర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజంలో ఉన్న వ్యవస్థల పైన అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ సంస్థల్లో ఎక్కడైనా అవినీతి, అక్రమమైన పద్ధతులు పాటిస్తే వాటిని సత్వరమే, విజిలెన్స్ విభాగానికి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకులు రజనీ, డాక్టర్ గణేష్ లెక్కల పాల్గొన్నారు.

విద్యుత్‌లో నాణ్యతా లోపం

ప్రజాశక్తి-కోటవురట్ల : నాణ్యమైన విద్యుత్తు అందకపోవడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మండల కేంద్రంలో వ్యాపార వర్గాలు, ఉద్యోగులు విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మోటార్లు పని చేయక గ్రామాల్లో తాగునీటి సమస్య ఎదురవుతోందని ఆయాప్రాంత నాయకులు, ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఇంజనీరు పరశు రామును వివరణ కోరగా మండల కేంద్రంలో సినిమా హాలు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చే క్రమంలో విద్యుత్ అంతరాయం ఏర్పడిందని చెప్పారు. ఇటీవల ఏర్పడిన తుఫాను కారణంగా పలుచోట్ల దెబ్బతిన్న విద్యుత్ లైన్లు కూడా పూర్తిస్థాయిలో పరిష్కరిస్తున్నామని తెలిపారు.

సాయి శ్రేయాస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ఫార్మా సిటీలో సాయి శ్రేయాస్ యాజమాన్యంపై ప్రమాదంపై కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని ఫార్మసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సాయి శ్రేయాస్ కంపెనీలో జూన్ 11వ తేదీన ప్రమాదకరమైన విష వాయువు విడుదల కావడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారని గుర్తు చేశారు. ఈ ప్రమాదంపై ప్రభుత్వం 75 రోజుల తర్వాత కమిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కమిటీ వ్యర్థ జలాల ట్రీట్మెంట్ ప్లాంట్ న్యూట్రలైజేషన్ చేస్తుండగా పరిశీలనకు వెళ్ళిన ఇద్దరు భద్రత విభాగానికి చెందిన ఉద్యోగులు ట్యాంక్ మాన్యువల్ నుంచి వచ్చిన ప్రమాదకరమైన వాయువులను పీల్చడం వల్లనే మరణించారని నిర్ధారించిందని పేర్కొన్నారు. కంపెనీలో ఇంకా 80 కిలో లీటర్ల వ్యర్థ జలాల స్టోరేజ్ ట్యాంక్‌లో ఉందని, దానిని వెంటనే బయటకు తరలించాలని, స్టోరేజ్ ట్యాంక్ ప్రాంతంలో వాయువులను గుర్తించే పరికరాలు ఏర్పాటు చేయాలని, ఎస్ఓపి పాటించాలని, స్టోరేజ్ ట్యాంకు స్క్రబ్బర్ విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసి వాటి రీడింగ్ ప్రతినెలా కాలుష్యం నియంత్రణ మండలికి పంపించాలని సూచనలు చేసిందని తెలిపారు. జాయింట్ కమిటీ ఇన్స్పెక్షన్ చేసిన అనేక విషయాలు బయట పెట్టలేదన్నారు. పరిశ్రమలో అంతర్గత భద్రత వైఫల్యం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని, పరిశ్రమలో స్క్రబ్బింగ్ విధానం లోపాలు ఉన్నాయని, దానిని తప్పు పట్టలేదని పేర్కొన్నారు. నిర్వహణ లోపాలు భద్రత వైఫల్యాలు అంశాలను విస్మరించిందన్నారు. ఏ పరిశ్రమలో అయినా ప్రమాదం జరిగిన వెంటనే 48 గంటల్లో విచారణ కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉండగా, 75 రోజుల తరువాత వేయడమంటే యాజమాన్యానికి ప్రభుత్వం కొమ్ము కాయడమే అవుతుందని విమర్శించారు.



నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త

ముంపునకు గురైన పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని గోకివాడ, మూలజంప గ్రామాల్లో తుపాన్ సందర్భంగా నీట మునిగిన వరి, చెరుకు పంటలను బిసిటి సీనియర్ శాస్త్రవేత్త శ్రీహరి, మండల వ్యవసాయ అధికారి సి.సుమంత శనివారం పరిశీలించారు. అవకాశం ఉన్నచోట నీరు పూర్తిగా తీసివేసి, వరి పంటకు ఎకరానికి 20 కేజీలు యూరియా, 20 కేజీలు పొటాష్ జల్లుకోవాలని సూచించారు. పొట్ట దశలో ఉన్న పైరుకు కార్బండి జమ్ంమాంకోజబ్ 2జి లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు కిశోర్, నూకరాజు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని జోగన్నపాలెం, కింతాడ గ్రామాల్లో అయ్యన్న జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీల జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్.) ఆధ్వర్యాన వారం రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక శిబిరం శనివారం ప్రారంభమైంది. ప్రత్యేక శిబిరం చైతన్య ర్యాలీని విద్యా సంస్థల వద్ద ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం పూర్వపు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు ఎన్ఎస్ఎస్ పతకాన్ని ఊపి ప్రారంభించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు గాడి అప్పారావు, సీమునురు రమణ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక శిబిరాన్ని అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, కింతాడ సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ ముత్యాలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కశిరెడ్డి అప్పలనాయుడు, ఎంపీటీసీ పల్లా కన్నమ్మరాజేశ్వరరావు, మాజీ సర్పంచ్ బండారు అరుణానరసింహనాయుడు, కన్నూరు అప్పల నాయుడు, బండారు ఫణింద్రపాత్రుడు, త్రినాధ్ పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తొలిరోజు జోగన్నపాలెం, కింతాడ గ్రామాల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు.



ఎన్‌సిసి శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రూ.5కోట్లతో సిహెచ్‌సి ఆధునీకరణ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిని రూ.5 కోట్ల ఆధునికీకరణ చేపడుతున్నామని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఆసుపత్రిలో నూతన ఎక్రే ప్లాంట్ ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఆసుపత్రి వంద పడకలగా మారిపోతుందని చెప్పారు. పోస్టుమార్టం నిర్వహించేందుకు మార్చురీ భవనాన్ని ప్రారంభించారు. చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా సేవలో అందుతాయని అన్ని విభాగాల్లోనూ ప్రజలకు వైద్యం అందించేందుకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి మల్లునాయుడు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, ఎంపీడీవో ఆంజనేయులు, పంచాయతీ ఈవో కే శ్రీనివాసరావు, ఆసుపత్రి ప్రధాన వైద్యులు దినేష్ కుమార్, సర్పంచ్ బండి నూకాలమ్మ, ఎంపీటీసీ రూపా దేవి, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎర్రంశెట్టి చిన్న, సకురు కోటేశ్వరరావు, పప్పు శ్రీను, ఎలక మల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

వివిధ దేవాలయాల ట్రస్టు బోర్డు చైర్మన్ల నియామకం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకష్ణ సిఫార్సు మేరకు రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లిలోని పలు దేవస్థానాల ట్రస్ట్ బోర్డ్ చైర్మన్లు, సభ్యులను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన ఆయా ఆలయాల చైర్మన్లు ఎంపీ రమేష్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రలకు కొత్తగా నియమితులైన నూకంబిక అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పీలా నాగశీను, హేమగిరి సత్యనారాయణ దేవస్థాన చైర్మన్ అప్పికొండ గణేష్, సుంకరమెట్ట సత్యనారాయణ సూర్యనారాయణమూర్తి దేవస్థాన చైర్మన్ బొడ్డేడ మురళి, జగన్నాథ స్వామి దేవాలయ చైర్మన్ దాడి బుజ్జి, ఆయా ఆలయాల ట్రస్టు బోర్డుల సభ్యులు, టెలికాం బోర్డు సభ్యులు బుద్ధ రాజేష్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారంతా జనసేన ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీని సత్కరించారు.



నియామక పత్రాలు చూపుతున్న దేవాలయాల చైర్మన్లు

జన జాతీయ గౌరవ దినోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు, జానపద నాయకుడు బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా నవంబరు 1 నుండి 15 తేదీ వరకు నిర్వహించనున్న జన జాతీయ గౌరవ దినోత్సవ వేడుకలను జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ప్రారంభించారు. బిర్సాముండా, ఇతర గిరిజన నాయకుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ముందుగా కలెక్టరు కార్యాలయంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ బిర్సా ముండా జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ఆత్మగౌరవంతో జీవించాలన్నారు. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని నవంబరు 15వ తేదీన నిర్వహంచనున్న జాతీయ గౌరవ్ దివస్‌కు ముందుగా నవంబరు 1 నుండి 15 రోజులు ఈ వేడుకలను గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, వీటిని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిఆర్ఓ ఎస్‌విఎస్. సుబ్బలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మంగవేణి, కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి విజయకుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-పరవాడ : మొంథా తుఫాన్ సమయంలో తీర ప్రాంత గ్రామాలలో తుఫాన్ బాధితులకు ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ అధికారులను శనివారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సాలువాతో సన్మానించారు. తీర ప్రాంత మత్స్యకార గ్రామాలైన ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, జాలారిపేట, సమ్మంగిపాలెం, తిక్కవానిపాలెం గ్రామాలలో తుఫాన్ సమయంలో లోతట్టు ప్రాంతాలు, పూరి గుడిసెలలో నివసిస్తున్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి సేవలు అందించారు. ఇందులో ఉత్తమ పనితీరు కనబరిచిన స్పెషలాఫీసర్ అనిత, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రమేష్ నాయుడు, పరవాడ ఆర్ఐ రమణ, చీపురుపల్లి తూర్పు వీఆర్వో సిహెచ్ అప్పారావు, ముత్యాలమ్మపాలెం సచివాలయం కార్యదర్శి రజిని, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత, తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, ఎంపీటీసీలు, అర్జిల్లి దేవిరవి, మైలపల్లి అప్పన్న సిబ్బందిని సన్మానించారు.

ఆలయాలకు విరాళాలు

ప్రజాశక్తి-మునగపాక : మండల కేంద్రం మునగపాకలో నిర్మాణంలో ఉన్న వెంకటేశ్వర ఆలయానికి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష రూపాయలు, అనకాపల్లికు చెందిన వీఆర్వో అచ్చయ్య నాయుడు రూ.5 వేలు కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే వాడ్రాపల్లి గ్రామంలో షిరిడి సాయిబాబా విగ్రహానికి వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ రూ.12 వేలు విలువచేసే మకర తోరణాలను అందజేశారు.

ట్రాఫిక్ నియంత్రణ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అనకాపల్లి-అచ్యుతాపురం ప్రధాన రహదారిలో కొండకర్ల జంక్షన్ వద్ద శనివారం వందలాది వాహనాలు నిలిచిపోవడంతో అటువైపుగా వెళ్లిన ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమం చేపట్టారు. రాకపోకలు సాగించడానికి వీల్లేక వందలాదిమంది ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే కారు దిగి వాహనాల నియంత్రణ చేశారు. కొండకర్ల, చౌడపల్లి గ్రామాల మధ్యన కల్వర్టులు నిర్మించడంతో ట్రాఫిక్‌కు ప్రతిరోజు అంతరాయం ఏర్పడుతుంది.

తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : తుఫాన్‌లో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ఆవ కాలువను ముంచేత్తుతున్న తోటాడ రెగ్యులేటరీని వద్ద జంగిల్ క్లియరెన్స్ తక్షణమే చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తోటాడ రెగ్యులేటరీని పరిశీలించారు. జంగిల్ క్లియరెన్స్ లేకపోవడం వలన అనకాపల్లి ఆవ కండంలో 1700 ఎకరాలు నీట మునిగిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు విల్లూరి పైడారావు, బొడ్డేడ అప్పారావు, డాక్టర్ చిన్నియాదవ్, ఆడారి బుచ్చిరాము, కొల్లి చిన్న అప్పారావు, బొబ్బిలి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఉపయోగపడే మైక్ సెట్‌ను విరాళంగా శనివారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సత్యారావుకు పూర్వ విద్యార్థులు పర్రె చిరంజీవి, గంట సన్యాసినాయుడు, ముమ్మన జగన్నాథం, తాండ్రంగి అబ్బాయ్ నాయుడు అందజేశారు.

'మన డబ్బులు-మన లెక్కలు'పై శిక్షణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం ఈ-నారీలకు మన డబ్బులు-మన లెక్కలు అన్న అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు జి.లావణ్య మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యుల పొదుపులు, రుణాలు, బ్యాంకు లింక్ వివరాలు వంటి ఆర్థిక లావాదేవీలను సభ్యులు స్వయంగా తెలుసుకోవడానికి ఈ మొబైల్ యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపిఎం ప్రభాకర్, సీసీలు, ఈ-నారీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్నిఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష ఫలితంగా 1956 నవంబర్ 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు.. 2014లో తెలంగాణ విభజన తర్వాత నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంగా ప్రభుత్వం జరుపుకుంటూ వస్తోందన్నారు. కార్యక్రమంలో జోనల్ అడ్వైజర్ కోన ప్రకాష్, జోనల్ కోశాధికారి పచ్చిపులుసు కనకారావు, జోనల్ జాయింట్ సెక్రటరీ కడగళ్ల నారాయణరావు, ఆర్ఎంపీ మండల అధ్యక్షుడు పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి, గొట్టుముక్కల రఘు, వెనిగళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు

యలమంచిలి టౌన్ : ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా యలమంచిలి దిమిలి సెంటర్లో గల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం పెద్దలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎ.గుప్తా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చేసిన పోరాటాన్ని చేసిన త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బండారు బంగారు శెట్టి, కట్టా శ్రీను, బసవరాజు, సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి : సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లానాగభూషణం ఆధ్వర్యంలో స్థానిక కన్యకాపరమేశ్వరి దేవాలయం జంక్షన్లో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్‌టిసి డిపో మేనేజర్ కె.హనుమశ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్న పిరాట్ల నరసింహమూర్తికు పొట్టి శ్రీరాములు సేవా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, బొడ్డు సోమరాజు, అయ్యగారు వెంకటరమణ మూర్తి పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని శంకరం గ్రామంలో ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్లను శనివారం కలెక్టర్ విజయకృష్ణన్ పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. అనంతరం శంకరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటిస్తూ వారి పఠనాశక్తిని పరిశీలించారు.

కె.కోటపాడు : మండలంలోని అర్లే గ్రామంలో సామాజిక పింఛన్లను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పివిజి కుమార్, రొంగళి మహేష్, సబ్బవరపు రామునాయుడు, బోలెం బుల్లిదొర, కన్నూరు సూర్యనారాయణ పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక శెట్టిబలిజ కాలనీలో శనివారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు తోటవీధి వార్డు సచివాలయంలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్ సి ఒమ్మి అయ్యప్పనాయుడు, యుసిడి, ఎపిడి దొర, కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, గంటా అప్పల కొండ, పార్టీ నాయకులు నూక రాజు, గొలగాని నరేంద్ర కుమార్, పాల్గొన్నారు

కొత్త పింఛన్లు మంజూరు

యలమంచిలి టౌన్ : పట్టణంలోని యర్రవరం సచివాలయం పరిధిలో కొత్తగా రెండు డయాలసిస్ పెన్షన్లు, ఒక స్పౌస్ పెన్షన్ మంజూరైనట్లు సచివాలయ సెక్రటరీ స్రవంతి తెలిపారు. డయాలసిస్ పెన్షన్ ఒక్కొక్కరికి రూ.10వేలు, స్పౌస్ పెన్షన్ రూ.4000 అందించారు. కార్యక్రమంలో బొద్దపు శ్రీనివాసరావు, గొర్లె నానాజీ, గోపినాథ్, రవికుమార్, రాజమహేష్, తులసి రామ్ పాల్గొన్నారు.

రావికమతం: మండలంలో కవగుంట గ్రామానికి చెందిన బీరా ఈశ్వరమ్మకు నూతనంగా మంజూరైన వితంతు పెన్షన్ 4 వేలను సర్పంచ్ దాసరి సూర్యకుమారి, కార్యదర్శి రాజబాబు చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వితంతు మహిళలు గ్రామంలో సుమారు పది మంది వరకు ఉన్నారన్నారు. వారికి కూడా పెన్షన్ మంజూరు చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రభ, గ్రామ పెద్దలు చిన్న కళ్యాణం దొర, పర్రె రాజారావు, అప్పారావు పాల్గొన్నారు.

అదాని ఏజెంట్‌లా కలెక్టర్ మాట్లాడటం హాస్యాస్పదం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఐఎఎస్ చదువుకున్న కలెక్టర్ అదాని, నవయుగ కంపెనీలకు ఏజెంట్‌లా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్లు ఒప్పందాలకు సంబంధించిన 2, 13, 51 జిఒలను రద్దు చేయాలని కొంత కాలంగా ఆదివాసీలు కొంత కాలంగా పోరాడుతుంటే వారికి అవగాహన లేక పోవడంతోనే ఉద్యమాలు చేస్తున్నారని కలెక్టర్ మాట్లాడటం దారుణమన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల ఆదివాసీలకు నష్టం జరగదని 4,500 మందికి పరోక్షంగా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కలుగుతాయని, కంపెనీ ద్వారా నష్టపోయిన గ్రామాల్లో అంగన్వాడీ బిల్డింగ్‌లు, కమ్యూనిటీ హాల్స్, రోడ్లు వేస్తారని, ఇళ్లు పోయిన వారికి పునరావాసం కింద రూ.8 లక్షలు వరకు పరిహారం ఇస్తారని అదాని, నవయుగ ఏజెంట్‌లాగ కలెక్టర్ మాట్లాడటం దారుణమన్నారు. అబద్ధాలతో గిరిజనులకు మాయమాటలు చెప్పి కంపెనీలకు అనుకూలంగా ఒప్పించడం కోసం కలెక్టర్ పూనుకోవడం సరికాదని హితవుపలికారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల వల్ల ఆదివాసీ గ్రామాలు, భూములు, అడవులు పర్యావరణం సహజ వనరులు వేటికి నష్టం జరగదని కలెక్టర్ చెప్పడం దుర్మార్గమన్నారు. కలెక్టర్ వ్యవహార శైలిని ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తీవ్రంగా ఖండించాలని కోరారు.

అయోడిన్ లోపంతో రుగ్మతలపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో అయోడిన్ లోపం వలన అనారోగ్య సమస్యలు, వ్యాధులు, రుగ్మతల గూర్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హైమావతి, యన్‌సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్తేర్ రాణి మాట్లాడుతూ శరీరానికి అవసరమైన అయోడిన్ సరిపడా అందకపోవడం వల్ల వచ్చే ఒక ఆరోగ్య సమస్యలు గూర్చి వివరించారు. కార్యక్రమంలో పిహెచ్సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్సుఎన్మఆర్ చక్రవర్తి, వైద్య అధికారి వై.స్వర్ణలత, సిహెచ్‌ఓ, ఎన్‌సిడి కన్సల్టెంట్ డాక్టర్ విశ్వనాధం పాల్గొన్నారు.



సన్యాసమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

సన్యాసమ్మ కుటుంబానికి సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మడకపాలెం గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్, మహిళా రైతు సన్యాసమ్మ విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతి చెందగా, ఆమె కుటుంబాన్ని సిపిఎం నేతలు కర్రి అప్పారావు, ఎస్ బ్రహ్మాజీ శనివారం పరామర్శించారు. మృతికి గల కారణాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వలననే సన్యాసమ్మ మృతి చెందిందని తెలిపారు. కాలం చెల్లిన వైర్లు మార్చకపోవడం వలన అవి తెగిపడటంతో అవి తగలి సన్యాసమ్మ మృత్యువాత పడటం బాధాకరమన్నారు. తక్షణమే విద్యుత్ శాఖ అధికారులు పరిహారం అందజేసి ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అదుపుతప్పి బొగ్గు లారీ బోల్తా

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని కలపాక పంచాయతీ స్వయభూవరం దుర్గాదేవి అమ్మవారి ఆలయం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున బొగ్గు లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రాంతంలో డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. అధిక లోడుతో వాహనాలు నిర్లక్ష్యంగా నడపడం, డ్రైవర్లు రాత్రిపూట మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఈ రకమైన ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెన్నెలపాలెం, కలపాక, పిట్టవానిపాలెం, 77వ వార్డు మార్గం ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజూ వందలాది ప్రజలు ఈ దారిలో ప్రయాణిస్తున్నారు. అయినప్పటికీ వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చేతులు కట్టుకుని చూస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చీకట్లో నిలబడి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేసే అధికారులకు, వెలుతురులో అధిక లోడుతో వెళ్తున్న లారీలు కనబడవా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని అధిక లోడుతో నడిచే లారీలను నియంత్రించి, రాత్రిపూట డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నూకాంబిక ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులో నూకాంబిక ఆలయ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. మంచినీటి కోనేరును ఆనుకుని గ్రామానికి చెందిన శెట్టిబలిజ కులస్తులు ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కుటుంబాలతో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంట, ములకలాపల్లి గ్రామాలకు ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు దేవరాపల్లి మండల ట్రాన్స్‌కో ఏఈ కె.శంకరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గ్రామాలలో సింగల్ లైన్ విద్యుత్తు సౌకర్యం కోసం విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందువలన విద్యుత్తు అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

వర్షాలకు దెబ్బతిన్న రహదారి

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలోని బికెపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో చెరువుకు వెళ్లే కాలువ వద్ద రోడ్డు వర్షానికి పూర్తిగా శిథిలమైంది. దీంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రాత్రి సమయంలో పలుమార్లు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. ఇటువంటి ప్రదేశాలు ఈ రోడ్డులో రెండు చోట్ల ఉన్నాయి. ఆ ప్రదేశాల వద్ద కల్వర్టులు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.



శిథిలమైన రహదారి

భయం.. భయం...

-గ్రామాల్లో కోతులు, కుక్కల హల్‌చల్-వాహనదారులపై దాడులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పలు గ్రామాల్లో కోతులు, కుక్కల సమస్య వెంటాడుతోంది. ముఖ్యంగా చీడిగుమ్మల, జోగంపేట, కొంగసింగి, లింగంపేట, పాత కృష్ణదేవిపేట, చోద్యం, ఏఎల్.పురం తదితర గ్రామాల్లో వీటి సంచార అధికమైంది. కుక్కలు వీధివీధిన గుంపులు గుంపులుగా సంచరిస్తూ భయ పెడుతున్నాయి. చిన్న పిల్లలపైన, సైకిళ్ళు, బైక్‌లపై వెళ తున్న వారిని వెంబడిస్తున్నాయి. ఈ క్రమంలో పలువురు గాయపడిన సంఘటనలు లేకపోలేదు. చీకటి పడితే ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయంగా ఉంటుందని పలువురు అంటున్నారు. పలువురు కుక్క కాట్లకు గురై ఆసుపత్రిలో చికిత్సలు కూడా పొందుతున్నారని పలువురు తెలిపారు. ఇక కోతులైతే ఇళ్లపై, ప్రహరీ గోడల, చెట్లపైన చెంగు..చెంగున గెంతులెస్తూ దడపుట్టిస్తున్నాయి. ఇళ్ల వద్ద సామగ్రిని, ఎండలో ఆరబెట్టిన బట్టలను చిందరవందర చేస్తున్నాయి. ఇళ్ల వద్ద పెంచుకునే మొక్కలతో పాటు పంటలను పాడు చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. పలు చోట్ల చిన్న పిల్లల చేతిలో వస్తువులను లాక్కుంటుండటమే కాకుండా దాడి చేస్తున్నాయని అంటున్నారు. వీటిని నియంత్రించాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారని పలు గ్రామాల ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి కుక్కలు, కోతల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో సంచరిస్తున్న కుక్కలు



రోడ్డు మధ్యలో కోతులు



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

సరుకులివ్వాలని వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి: మొంథా తుఫాన్‌కు ప్రభుత్వం ప్రకటించిన బియ్యం, నిత్యావసర సరుకులు ఇవ్వాలని మండలంలో రాజయ్యపేట గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికులు, రజకులు, క్షౌర వృత్తిదారులు, దళితులు కోరారు. ఈ మేరకు తహసిల్దార్ నరసింహ మూర్తికి వినతిపత్రం అందజేసారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజయ్య పేట గ్రామంలో మత్స్యకారులకు మాత్రమే బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారని, మత్స్యకారులతో పాటు ఆ గ్రామంలో తాము కూడా నివాసం ఉంటున్నామన్నారు. తుఫాన్ ప్రభావం కారణంగా పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేసారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మత్స్యకారులకు ఇచ్చిన విధంగానే, తమకు కూడా సరుకులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

గెడ్డలో గండి మరమ్మతు పనులు

ప్రజాశక్తి-నర్సీపట్నం:తుపాను కారణంగా మాకవరపాలెం మండలం జాగారాల గెడ్డకు పడిన గండి కారణంగా జీ కోడూరు గ్రామంలో పలుచోట్ల పంట పొలాలు ముంపుకు గురయ్యాయి. ప్రస్తుతం పంట పొలాలకు ఎటువంటి నీటి సమస్య రాకుండా ఈ మెరకు అధికారులు ముంపు ప్రాంతాన్ని, గండి ప్రాంతాన్ని సందర్శించారు ఇరిగేషన్ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు.



గండిని పూడ్చి వేయిస్తున్న అధికారులు

కార్తీక దీపోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్

ప్రజాశక్తి -నర్సీపట్నం:పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకొని శనివారం ఏకాదశి రోజు నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ కోరారు. ఈ మేరకు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ బాలికల పాఠశాల గ్రౌండ్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరవుతారని, ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.



మాట్లాడుతున్న విజయ్

ఏడాది జైలు, రూ.9 వేల జరిమానా

ప్రజాశక్తి -నక్కపల్లి:చీటింగ్, ఫోర్జరీ కేసుకు సంబంధించి ఎలమంచిలి కోర్టు మెజిస్ట్రేట్ మండలంలో న్యాయం పూడి గ్రామానికి చెందిన కొప్పినీడు వెంకటరమణకు ఏడాది జైలు శిక్ష, 9 వేల రూపాయలు జరిమానా శు క్రవారం విధించినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. 2015 సంవత్సరంలో అప్పటి తహసిల్దార్ గా పనిచేసిన పి సుందర్రావు న్యాయంపూడి గ్రామానికి చెందిన కొప్పినీడు వెంకటరమణ పై ఫిర్యాదు చేయడంతో, అప్పటిలో ఎస్ఐగా పనిచేసిన రామకృష్ణ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

కూలిన పెంకుటిల్లు

- ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-వడ్డాది :మొంథా తుపాను ప్రభావానికి వడ్డాది కొత్తూరులో పెంకుటిల్లు కూలిపోయింది. నాలుగు రోజులు పాటు కురిసిన వర్షాలకు గోడలు నానిపోయి శుక్రవారం రాత్రి కూలి పోయింది. ఈ సమయంలో ఇంట్లో ఉన్న వర్రి దేముడు బాబుకు, సత్యవతికి గాయాల య్యాయి. సత్యవతికి తల పైన,చేయిపైన బలమైన గాయాలు కాగా, దేముడు బాబుకు స్వల్ప గాయాల య్యాయి. శనివారం ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వో పావని, టౌన్ టిడిపి అధ్యక్షుడు మెంబర్ దొండా నరేష్ ఘటనా స్థలానికి వెళ్లి బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న టీవీ, ఇతర వస్తువులు ధ్వంసం అయ్యాయి. ప్రమాదం నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి బాధిత కుటుంబానికి నష్టపరిహారం మంజూరు చేయిస్తామని ఆర్ఐ శ్రీనివాస్ తెలిపారు. కూటమినేతలు తలారి శంఖర్, ఎం. సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



కూలిన ఇల్లు

తుపాను బాధితులకు సరుకుల పంపిణీ



నక్కపల్లిలో సరుకులు ఇస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో డిఎల్ పురం, అమలాపురం గ్రామాల్లో మత్స్యకారులకు, నెల్లిపూడి గ్రామంలో చేనేత కార్మికులకు బియ్యం, ఇతర నిత్యవసర సరుకులను అందజేసారు. తుఫాన్ నేపథ్యంలో బాధితులకు ప్రభుత్వం నిత్యావసర సరుకులు అందజేసి అండగా నిలుస్తుందని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు నరసింహమూర్తి, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, నెల్లిపూడి సర్పంచ్ సురేష్ వర్మ, నాయకులు అప్పలరాజు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : మొంథా తుఫాన్ ప్రభావంతో చేపల వేటకు వెళ్లలేని జివిఎంసి 62వ వార్డులోని మత్స్యకారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు ఆదేశాలతో శనివారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ 25 కేజీల బియ్యం, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, కంది పప్పు, పంచదార కిలో చొప్పున లీటర్ పామాయిల్ కిట్‌ను వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మజ్జి మాలినాయుడు అందజేశారు.

అరిలోవ :జివిఎంసి 11వ వార్డులోని మత్స్యకార కుటుంబాలకు ప్రభుతపరంగా నిత్యావసరాల కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ రాగతి అచ్యుతరావు, అధ్యక్షులు ముగడ రాజారావు, క్యాటరింగ్ రాజు, జనసేన అధ్యక్షులు సారీపిల్లి రాము, మూది అప్పారావు, లింగం సత్యనారాయణ, బోయి శ్రీను, సిహెచ్ . ఆదినారాయణ రాజు, రంగాల మంగరాజు, సబ్బవరపు అప్పలనాయుడు పాల్గొన్నారు,

పద్మనాభం.: మండలంలోని రెడ్డిపల్లి, పద్మనాభం, పొట్నూరు గ్రామాల్లో నాలుగు మొంథా తుపాన్ బాధిత కుటుంబాలకు శనివారం స్థానిక తహశీల్దార్ కె.ఆనందరావు, మాజీ జెడ్‌పిటిసి దామోదరరావు, టిడిపి మాజీ అధ్యక్షుడు కె.నగేష్‌కుమార్ నిత్యావసరాల కిట్‌లను అందజేశారు.

ప్రజాశక్తి ఎస్ రాయవరం.(యాడ్ పర్సన్)

పరవాడ : మొంథా తుఫాన్ ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలోని బాధితులకు శనివారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు నిత్యావసర సరుకులు, అత్యవసర ఆర్థిక సహాయం పంపిణీ చేశారు. తుపాన్ బాధిత కుటుంబాలకు రూ.1000 చొప్పున, ప్రతి కుటుంబానికి గరిష్ఠంగా రూ.3,000 వరకు నగదు సహాయం అందజేశారు. ప్రతి కుటుంబానికి 50 కిలోల బియ్యం, కిలో ఉల్లిపాయలు, పప్పు, పంచదార, నూనె, బంగాళాదుంపలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ పాలెం సర్పంచి చింతకాయల సుజాత, తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, ఎంపీటీసీలు అర్జిల్లి దేవిరవి, మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, జనసేన నాయకులు పంచకర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : తుపాన్ బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బియ్యం, నిత్యావసర వస్తువులను మండలంలోని రేవుపోలవరం గ్రామంలో టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షులు కోడ లోవరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్.రాయవరంలో...



ములగాడలో...



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:మండలంలోని పోలేపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 156లో ఆక్రమణ స్థలంలో శనివారం రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అక్రమంగా ప్రవేశించి నట్లయితే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎం.లక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



చైతన్యకు మెడల్‌ను ఇస్తున్న ప్రిన్సిపల్ సత్యసునీల్

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు చైతన్య ఎంపిక

ప్రజాశక్తి: రావికమతం: మండలంలో మరుపాక ఆదర్శ పాఠశాల విద్యార్థి బంటు చైతన్య రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కే.సత్య సునీల్ శనివారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బంటు చైతన్య తమ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వాలీబాల్ అండర్ 17 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈ నెల ఒకటి, రెండు, మూడు తేదీలలో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. చదువుతోపాటు పలు రకాల క్రీడలు ప్రతి విద్యార్థికి చాలా ముఖ్యమన్నారు. ఆటల పోటీలు మనిషికి మంచి ఆరోగ్యంతో పాటు, ఉత్సాహం, ఉల్లాసం, పలు ఉద్యోగ రంగాలకు కూడా ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కే. సత్య సునీల్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కాసేటి రాజు, సిబ్బంది పలువురు చైతన్యను అభినందించారు.



మాట్లాడుతున్న ఎంపిపి రాజారామ్

ఉపాధి హామీపై గ్రామ సభ

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని జమ్మాదేవి పేట గ్రామంలో శనివారం ఉపాధి హామీపథకం కు సంబంధించి 2026-27లో చేయాల్సిన పనులపై గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపీవో మురళీకృష్ణ, ఎంపీపీ రాజారాం మాట్లాడుతూ, రైతులు, గ్రామంలో ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి ఒక్కరు స్పందించి వచ్చే 2026-27 సంవత్సరాకు గాను ఉపాధి కల్పించడానికి పనులను గుర్తించి ప్రతి ఒక్కరు ఉపాధి కల్పించడానికి గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సభ ఆమోదం తీసుకుని పనులు వేగవంతం చేయడం జరుగుతుందన్నారు. సంబంధించిన అధికారులు ఎక్కువ పనులు గుర్తించి ఉపాధి కూలీలకు ఎక్కువ రోజులు పని కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి ప్రసాదర్, కూటమి నాయకులు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

దేశభక్తి గీతాల పోటీలు

ప్రజాశక్తి -నర్సీపట్నం:పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా శనివారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు దేశభక్తి గీతాలు పోటీలు నిర్వహించారు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు తరగతులు చదువుతున్న వారిని జూనియర్స్‌గా విభజించారు. 8, 9, 10 చదువుతున్న వారిని సీనియర్స్‌గా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు గోపీనాథ్, న్యాయ నిర్ణేతలుగా శాంతా లక్ష్మి, వరలక్ష్మి వ్యవహరించారు.

ఉత్సాహంగా అనకాపల్లి పుస్తక మహోత్సవం



కోలాటం ఆడుతున్న మహిళలు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తూ చేపట్టిన పుస్తక మహోత్సవం శనివారం రెండవ రోజుకు చేరింది. పాఠశాల, కళాశాల విద్యార్థులు, గృహిణులు, తల్లిదండ్రులు, ఎంతో ఉత్సాహంగా పుస్తక ప్రదర్శనలో పాల్గొని విభిన్న పుస్తకాలను వీక్షించి, కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు, 3, 4, 5, 6, 7 తరగతుల విద్యార్థుల కోసం ప్రత్యేక పోటీలు నిర్వహించగా, సోలో శాస్త్రీయ నృత్యం, బృంద దేశభక్తి గీతాలాపన, బృంద జానపద నృత్యం, సోలో విచిత్ర వేషధారణ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొన్నారు. స్కూల్ విద్యార్థుల కోసం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మాయాజాల ప్రదర్శన (మ్యాజిక్ షో) నిర్వహించారు. అనంతరం అనకాపల్లి ప్రాంతానికి చెందిన ప్రముఖ సాహిత్యకారులు తమను ప్రభావితం చేసిన పుస్తకాలు, తమకు నచ్చిన పుస్తకాల గురించిన విశేషాలను పంచుకున్నారు.

నేడు జరిగే పోటీలు

ఆదివారం సాయంత్రం 3 నుంచి 6 గంటల మధ్య 8-12 తరగతుల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోలో శాస్త్రీయ నృత్యం, బృంద దేశభక్తి గీతాలాపన, బృంద జానపద నృత్యం, బృంద థింసా నృత్యం, సోలో విచిత్ర వేషధారణ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. సాహిత్య సమావేశం, కవిసమ్మేళనం సాయంత్రం 5 నుండి 7 గంటల వరకు జి. రంగబాబు, శ్రీ కోరాడ అప్పలరాజు నిర్వహణలో జరుగుతాయని తెలిపారు.



మ్యాజిక్ చేస్తున్న మెజీషియన్

గీతంలో రేడియాలజిస్ట్‌ల రాష్ట్ర సదస్సు



సన్మానిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం మెడికల్ కాలేజీలో ఇండియన్ రేడియాలజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ (ఐఆర్ఐఎ) రాష్ట్ర సదస్సు శనివారం ప్రారంభమైంది.సదస్సుకు ముఖ్య అతిథిగా రేడియాలజిస్టు, ఎంపీ డాక్టర్ శబరి బైరెడ్డి పాల్గొనగా, చిన్మయ విశ్వ విద్యాపీఠ్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ముక్కమాల అప్పారావు, ఎపి మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీ ఎయిమ్స్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజు శర్మకు ప్రతిష్ఠాత్మక కాకర్ల సుబ్బారావు స్వర్ణ పతకం, తిరుపతి ఎస్‌విఐఎంఎస్ డాక్టర్ ఎ.వై. లక్ష్మి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, బెస్ట్ యంగ్ అచీవర్స్‌గా డాక్టర్ కె. సుషెన్‌కుమార్, డాక్టర్ జివి.మోహన్ ప్రసాద్‌కు బంగారు పతకాలను బహూకరించారు. ఏషియన్ మస్కులో స్కెలెటల్ సొసైటీ అధ్యక్షుడిగా ఎంపికైన విజయవాడ డాక్టర్ వివిఎన్.వరప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ శబరి బైరెడ్డి దేశవ్యాప్తంగా రేడియాలజిస్టులకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ప్రారంభించారు. డాక్టర్ ముక్కమాల అప్పారావు మాట్లాడుతూ, రేడియాలజీలో కృత్రిమ మేధస్సు, ఆగ్మెంటెడ్ ఇంటెలిజెన్స్ వినియోగం రాబోయే దశాబ్దాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. గీతం ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ గీతాంజలి బట్నమనే సదస్సుకు రేడియాలజిస్టులను స్వాగతించారు. ఎపి ఐఆర్ఐఎ అధ్యక్షుడు, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ వి.సురేష్ ఆధ్వర్యంలో సెక్రటరీ డాక్టర్ ఉమమహేశ్వరరెడ్డి సమన్వయంతో నిర్వహించిన సదస్సులో విశాఖ కెజిహెచ్ రేడియాలజీ హెచ్‌ఒడి డాక్టర్ బుజ్జిబాబు, అపోలో ఆసుపత్రుల హెచ్‌ఒడి ప్రొఫెసర్ ఉమమహేశ్వరరావు, రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి రేడియాలజిస్ట్‌లు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయం కిటకిట

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో భక్తులు పోటెత్తారు. కార్తీక ఏకాదశి, శనివారం కావడంతో పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలాడింది. స్థానిక శివాలయంలో కూడా భక్తులు పోటెత్తారు.



క్యూ లో ఉన్న భక్తులు

నీట మునిగిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



ఇంకా నీటి ముంపులోనే ఉన్న వరి పంటను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

మొంథా తుపాన్ కారణంగా భారీ వర్షాలకు నీట మునిగిన పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో తుఫానుకు మునిగిపోయిన పొలాలను శనివారం శ్రీనివాసరావుతో పాటు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు డి.వెంకన్న గంటా శ్రీరాం తదితరులు పరిశీలించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ మొంథా తుఫాన్ వల్ల జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట నష్టం, ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. వారందరికీ శాస్త్రీయ పద్ధతిలో క్షేత్రస్థాయిలో అంచనా కట్టి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ, రెవిన్యూ అధికారులు తుమ్మపాల గ్రామంలో ఇంత వరకు పంట పొలాలను ఎందుకు పరిశీలించలేదని, పంటలు నష్టాన్ని ఎందుకు అంచనా వేయలేదని ప్రశ్నించారు. రైతులకు వంద శాతం పంట నష్టం జరిగినా అధికారులు పంట నష్టం నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. అనకాపల్లి మండలంలోని వెంకిపాలెం, సీతానగరం, తగరంపూడి, ఊడేరు, దిబ్బపాలెం, మాటూరు, జగన్నాథపురం, మెట్టపాలెం, సుందరయ్యపేట, కుంచంగి, రొంగలి వానిపాలెం, పిసినికాడ, అనకాపల్లి, శంకరం, గొలగాం తదితర గ్రామాల్లో ఉన్న సుమారు 4000 ఎకరాల్లో వరి, చెఱకు, కూరగాయలు, సరుగుడు, ఇతర పంటలన్నీ నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. వెంకుపాలెం నుండి కుంచంగి వెళ్ళే రహదారిని ఎత్తుగా వేయడం వలన వర్షపు నీరు పోవుటకు సరైన మార్గం లేక పోవడంతో వెంకుపాలెం, సీతానగరం, కుంచంగి, తగరంపూడి రెవెన్యూ పరిధిలోని సుమారు 1000 ఎకరాలు నీట మునిగాయని తెలిపారు. వెంకుపాలెం నుండి సుందరయ్య పేట వెళ్ళే మార్గంలో ఉన్న వెదుళ్ళగెడ్డ వలన సుందరయ్యపేట, వెంకుపాలెం, కుంచంగి గ్రామాల్లో ఉన్న 500 ఎకరాలు, బొజ్జన్న కొండ వద్ద నీరు వుండిపోవడం వలన సుమారు 1500 ఎకరాలు, దిబ్బపాలెం నుండి పిసినికాడ వరకు శారదానది పరివాహక ప్రాంతంలో సుమారు 500 ఎకరాలకు పైగా పంటలు నీటమునిగిపోయాయని తెలిపారు. పంట చేతికి అందివచ్చే సమయంలో ఈ తుఫాన్ రావడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఒక ఎకరానికి రూ.30వేలు నుంచి రూ.40 వేలు వరకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టారని, తుపాన్‌వల్ల మొత్తం పంటలు నాశమైపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎ.రాజు, ముత్తా నూకునాయుడు, శ్రీనివాసరావు, రమణ, చిన్న నాయుడు, సుధా, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



అప్పలరాజును పరామర్శిస్తున్న శ్రీనివాసరావు, లోకనాథం

అప్పలరాజుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పరామర్శ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాడుతున్న మత్స్యకారులకు అండగా ఉంటున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు రాజయ్యపేట వెళ్ళకుండా పోలీసులు పలు మార్లు నోటీసులు ఇచ్చి, పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి గృహ నిర్బంధంలో ఉన్న నేపథ్యంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఆయన్ను పరామర్శించారు. శనివారం ఉదయం మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలో అప్పలరాజు స్వగృహాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం సందర్శించి అప్పలరాజుకు, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పోలీసులు కేసులు, నిర్బంధంపై అధైర్య పడొద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, అప్పలరాజు తల్లి లచ్చమ్మ, భార్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.